ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
04-08-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 336 | పేజీలు : 8 | వెల : 4



## పాపం.. మనుబాకర్

జయభేరి, లండన్, ఆగస్టు 3:

పారిస్ ఒలింపిక్స్‌లో మనుభాకర్ మరో పతకాన్ని తృటిలో కోల్పోయారు. ఇరవై ఐదు మీటర్ల పిస్టల్ షూటింగ్ ఫైనల్లో ఆమె నాలుగో స్థానంలో నిలిచారు. మొదట్లో ఆమె టాప్ త్రీ పొజిషన్‌లో ఉన్నప్పటికీ చివరిలో ఒత్తిడికి గురవడంతో తక్కువ పాయింట్లు సాధించారు. దీంతో.. నాలుగో స్థానానికి పడిపోయారు. ఇప్పటికే షూటింగ్‌లో రెండు కాంస్య పతకాలను మను భాకర్ సాధించారు. ఇరవై ఐదు మీటర్ల పిస్టల్ షూటింగ్‌లో దక్షిణ కొరియాకు చెందిన జె.ఐ యంగ్ 37 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఫ్రాన్స్‌కు చెందిన షూటర్, మూడో స్థానంలో హంగెరీ షూటర్ ఉన్నారు. రేసు చివరి వరకూ రెండో స్థానంలో ఉన్న మనుభాకర్ చివరికి వచ్చే సరికి వెనుకబడిపోయారు. 28 పాయింట్లలో నాలుగో స్థానంతో సరి పెట్టుకున్నారు. మన భాకర్ ఇప్పటికే పది మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీలో కాంస్య పతకం సాధించారు. తర్వాత పది మీటర్ల మిక్స్ డ్ పోటీలో సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి మరో కాంస్య పతకం సాధించారు. ఇరవై ఐదు మీటర్ల పిస్టల్ అంశంలో గట్టిగా పోరాడినప్పటికీ.. నాలుగో స్థానంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. పోటీ పూర్తయ్యే సరికి టాప్ త్రీ పొజిషన్స్ కోసం నలుగురు పోటీలో ఉన్నారు. మను భాకర్

...మిగతాది 2 లో



## 70 ఏళ్లు.. 70అడుగులు

ఖైరతాబాద్ గణేష్

- జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 3:

హైదరాబాద్‌లో ది ఫేమస్ ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి లంబోదరుడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. అయితే ఖైరతాబాద్ గణేషుడు రికార్డ్‌లకు కేరాఫ్‌గా మారాడు. ఈసారి కూడా హైట్‌లో తన పేరు మీదున్న రికార్డును తానే బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. 70 అడుగుల ఎత్తులో... ఈ ఏడాది సప్తముఖ గణేశుడి రూపంలో దర్శనమివ్వబోతున్నాడు. పూర్తిగా మట్టితో మహాగణపతి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు కోటి రూపాయల ఖర్చుతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖైరతాబాద్ గణేశుడికి ఇరువైపులా.. శివపార్వతులు, శ్రీనివాసుల కల్యాణ మండపం.. ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాలరాముడి విగ్రహం ఉంటాయి. ఖైరతాబాద్ గణేషుడికి సుమారు ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. 1954లో సింగరి శంకరయ్య అనే స్థానిక భక్తుడు స్థానిక ఆలయంలో ఒక అడుగు ఎత్తున్న గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి సామూహిక పూజలు చేశారు. అలా.. 2014 వరకు ప్రతి ఏటా

...మిగతాది 2 లో

# ఇళ్లకు 4. 50 లక్షలు



జయభేరి, ఖమ్మం, ఆగస్టు 3

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం కీలక ప్రకటన చేశారు. పథకంలో భాగంగా ఈ నెలాఖరులోపు మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

అర్హులైన వారందరికీ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క పర్యటించారు. గాంధీనగర్ క్రాస్ మైలారం గుట్టపై ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొంగులేటి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఏ వేదికపైకి ఎక్కినా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల గురించి మాయమాటలు చెప్పారని, తన సొంత నియోజకవర్గంలో నిర్మించిన ఇళ్లను పేపర్లలో ఫోటోలు వేయించుకుని ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో ఓట్లు అడిగారని మండిపడ్డారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 1.50 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మిస్తే ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలోనే 4.50 లక్షల ఇళ్లు

...మిగతాది 2 లో



## తెలంగాణ మహిళ మంత్రి వీడియో మార్ఫింగ్

జయభేరి, హైదరాబాద్:

రాను రాను సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. యువతులపై లైంగిక వేధింపులే కాకుండా. వారి ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేస్తూ దుర్మార్గానికి పాల్పడుతుంటారు కొందరు వ్యక్తులు. సామాన్య మహిళలే కాదు మంచి హోదా, పరపతి ఉన్న వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఏకంగా తెలంగాణ రాష్ట్ర మహిళ మంత్రిని సైతం వదలలేదు ఆగంతకులు. మంత్రి సీతక్కకు సంబంధించిన వీడియోను కొందరు ఆగంతకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. వీడియోని మార్ఫింగ్ చేసి సౌండ్స్ మార్చి ఎక్స్ ఖాతాలో సదరు ఆగంతకులు

...మిగతాది 2 లో



## భారీ పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ టూర్

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 3:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. 10 రోజుల పర్యటనలో భాగంగా అమెరికాతో పాటు, దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ముఖ్యమంత్రితో పాటు, మంత్రి శ్రీధర్ భాబు.. అధికారలు బృందం అమెరికాకు బయలు దేరి వెళ్లారు.రాష్ట్రానికి భారీ పెట్టుబడే లక్ష్యంగా సీఎం విదేశీ పర్యటన ఉంటుందని ఇది వరకే అధికారులు ప్రకటించారు. మొదట హైదరాబాద్ నుంచి న్యూయార్క్ చేరుకుంటారు. అక్కడ ఆరోజు రోజుల అనంతరం అక్కడి నుంచి నేరుగా దక్షిణ కొరియా వెళ్తారు. అనంతరం అక్కడ పర్యటన ముగించుకొని తిరిగి సీఎం బృందం ఈ నెల 14వ తేదీన ఉదయం హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.ఈ పది రోజుల పర్యాటనలో భాగంగా సీఎం బృందం పారిశ్రామిక దిగ్గజాలతో 52 సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా రూ. 50 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల రంగంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ కంపెనీలతో చర్చలు జరపనున్నారు. వీరిలో ప్రముఖంగా అమెజాన్

...మిగతాది 2 లో



## బాధితులకు రూ.10 లక్షల విరాళం

స్టార్ హీరోయిన్ రశ్మిక మందన్న

బ్లాక్ బస్టర్ మూవీస్ తో పాన్ ఇండియా క్వీన్ గా పేరు తెచ్చుకుంది రశ్మిక మందన్న. సోషల్ ఇష్యూస్ పై స్పందించే రశ్మిక పలు సందర్భాల్లో తన వంతు సాయం అందించేందుకు ముందుకొచ్చింది. కేరళ వయనాడ్ లో ఇటీవల కొండచరియలు విరిగిపడి సృష్టించిన విషాధం పట్ల రశ్మిక మందన్న తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. బాధితులను ఆదుకునేందుకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం 10 లక్షల రూపాయల విరాళం ప్రకటించింది. ఈ కష్ట సమయంలో కేరళ ప్రజలంతా ధైర్యంగా ఉండాలని ఆమె పేర్కొంది.

## టెలికం రంగంలోకి టాటా...

జయభేరి, ముంబై, ఆగస్టు 3:

తక్కువ రీఛార్జ్‌లతో ఉచిత నిమిషాలను అందించే టెలికాం కంపెనీ టాటా ఇండికామ్ మీకు గుర్తుందా? టాటా ఇప్పుడు టెలికాం రంగంలోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ఆకస్మిక భాగస్వామ్యం మిగిలిన టెలికాం కంపెనీలపై దాని ప్రభావం, వినియోగదారులకు ప్రయోజనాల గురించి దృష్టి పెట్టింది.ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ BSNL లో 15,000 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. డేటా సెంటర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. ఈ ప్రధాన పెట్టుబడి నాలుగు కీలక రంగాలలో పెద్ద వృద్ధిని సాధించగలదని అంచనా వేసింది. ఇది భారీ లాభాలను అందించే అవకాశం ఉంది.గ్రామంలో హై స్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉంటుంది. బీఎస్ఎన్ఎల్, టాటా మధ్య భాగస్వామ్యం అతి పెద్ద ప్రయోజనం ఏమిటంటే ఇది గ్రామాలకు హై స్పీడ్ ఇంటర్నెట్‌ని తీసుకురావడం. ప్లాన్ ప్రకారం.. బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే 4జీ పరీక్షను ప్రారంభించిన 1000 గ్రామాల్లో ఫాస్ట్ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకు ఈ గ్రామాలకు కేవలం 3G సేవ మాత్రమే ఉంది. ఇప్పుడు 4జీ అందుబాటులోకి వచ్చింది.ఈ భాగస్వామ్యం గురించి టాటా బీఎస్ఎన్ఎల్ కొనుగోలు చేసిందని పుకార్లు మొదలయ్యాయి. ఈ పుకార్లు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించాయి. అయితే వాస్తవం ఏమిటంటే, టాటా బీఎస్ఎన్ఎల్‌లో వ్యూహాత్మక పెట్టుబడి పెట్టింది. దానిని కొనుగోలు చేయలేదు.జూలై ప్రారంభంలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ తమ రీఛార్జ్ ప్లాన్‌ల ధరలను పెంచాయి. ఇది వినియోగదారులపై



ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. దీని కారణంగా చాలా మంది తమ నంబర్లను బీఎస్ఎన్ఎల్‌కి పోర్ట్ చేస్తున్నారు. ప్రతిస్పందనగా బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు 5G నెట్‌వర్క్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతోంది. దీని ట్రయల్ త్వరలో ప్రధాన నగరాల్లో ప్రారంభమవుతుంది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో టాటా, బీఎస్ఎన్ఎల్ మధ్య భాగస్వామ్యం మెరుగైన కనెక్టివిటీతో టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తుందని భావిస్తున్నారు.



## చంద్రబాబు మహిళలకు భరోసా

జయభేరి, విజయవాడ, ఆగస్టు 3:

రాష్ట్రంలో మహిళా ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యోగినులకు అవసరమైన ప్రతి చోటా వసతి గృహాలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రాలు, కార్పొరేషన్ స్థాయిలో 100 వసతి గృహాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు సీఎంకు వివరించగా.. ఉద్యోగినుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైతే డివిజన్ స్థాయిలోనూ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, వసతి గృహాల చెంతనే పిల్లల సంరక్షణకు వీలుగా ప్రత్యేక కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. తొలుత

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఇళ్లకు 4. 50 లక్షలు

నిర్మించబోతున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే జోడెద్దుల్లా పేదల కోసం కృషి చేస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థికంగా భారమైనా రైతు రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. 'గత ప్రభుత్వం రూ.7.20 లక్షల కోట్లు అప్పులు చేసింది. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట నెరవేర్చాలని సీఎం పట్టుబట్టి రుణమాఫీ చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలు మాఫీ చేశాం. ఈ నెలాఖరు వరకు రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తాం. రైతులకు అవసరమైన పనిముట్లలో ఇవ్వాల్సిన రాయితీలను బీఆర్ఎస్ ప్రభుత్వం మర్చిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజుగా చేసేందుకు రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా, వ్యవసాయ పనిముట్లపై రాయితీ, పంట ఇన్సురెన్సు, విత్తనాలపై రాయితీలు ఇస్తున్నాం.' అని మంత్రి పేర్కొన్నారు.

## పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ టూర్

వైస్ ప్రెసిడెంట్, కాగ్నిజెంట్ సీఈవో, ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ సీవోవో, పెప్సీ కో సీనియర్ మేనేజ్‌మెంట్, అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన వారు ఉన్నారు. ఇక ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితోనూ సీఎం భేటీ కానున్నారు. ఈ నెల6వ తేదీ వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ మీటింగ్ ఉండనుంది. మూసీ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రంలో చేపడుతున్న ఇతర ప్రాజెక్టుల గురించి ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం బృందం వివరించనుంది. ఈ ప్రాజెక్టుల్లో ప్రపంచ బ్యాంకు భాగస్వామ్యం కావాలని, ఆర్థిక సాయం చేయాలని కోరే అవకాశాలు ఉన్నాయి.ఇక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ కూడా సీఎం సందర్శించనున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్యంపైనా అక్కడి డీన్‌తో మాట్లాడనున్నారు. అనంతరం శాన్‌ఫ్రాన్సిస్కోలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జిని సందర్శించనున్నారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టబోయే అంశాలను అక్కడ పరిశీలించనున్నారు. ఇక దక్షిణ కొరియా పర్యటనలో టెక్స్‌టైల్ దిగ్గజ కంపెనీలతో సీఎం సమావేశం కానున్నారు.

## పాపం.. మనుబాకర్

హంగేరీకి చెందిన వెరోనికా మేజర్‌తో 28 పాయింట్లతో సమంగా నిలిచింది. ఐదుషాట్‌ల షూటాఫ్‌లో, మను భాకర్ రెండుసార్లు గురి తప్పగా, వెరోనికా మేజర్ ఒక్కసారి మాత్రమే గురి తప్పి29 పాయింట్లతో 3స్థానంలో నిలిచి టాప్ 3కి చేరుకుంది. దీంతో మను హ్యాట్రిక్‌ను కోల్పోయి రెండు చారిత్రాత్మక కాంస్య పతకాలతో పారిస్ ఒలింపిక్స్‌ను ముగించింది. షూటింగ్‌లో భారత్ ఇప్పటికే 3 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. మను బాకర్ రెండు కాంస్య పతకాలు సాధించగా, స్వప్నిల్ కుశల్ మరో కాంస్య పతకాన్ని సాధించారు. భారత్‌లో రెండు కాంస్యపతకాలు సాధించిన తొలి మహిళగా మను బాకర్ రికార్డు సృష్టించారు.

## 70 ఏళ్లు.. 70అడుగులు

ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ విగ్రహాన్ని తయారు చేశారు. 2019లో 61 అడుగుల ఎత్తున్న గణపతిని తయారు చేయగా.. భారతదేశంలోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా రికార్డులకెక్కింది. అప్పటినుంచి విగ్రహం ఎత్తు మళ్లీ క్రమంగా తగ్గించడం మొదలు పెట్టారు. దాంతోపాటు.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహానికి గుడ్ బై చెప్పి.. మట్టి గణపయ్యకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే.. గతేడాది (2023) పూర్తి మట్టితో 63 అడుగుల అత్యంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. గత సంవత్సరం కంటే 7 అడుగులు ఎక్కువ ఎత్తుతో కమిటీ నిర్వహకులు మొత్తం 70 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు.

## తెలంగాణ మహిళ మంత్రి వీడియో మార్ఫింగ్

సర్క్యులేట్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది వెంకట నాయక్ ఫిర్యాదు చేశారు. అలానే మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కూడా మార్ఫింగ్‌పై కూడా ఫిర్యాదు చేశారు. రెండు వీడియోలను సర్క్యులేట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ వెంకట్ నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్వకేట్ వెంకట నాయక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఐటీఏ 2000200, 79,33, 4,353(1) బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


మరోవైపు మంత్రి సీతక్క వీడియో మార్ఫింగ్ అంశం తెలంగాణ అసెంబ్లీలో చర్చకు వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. సభలో ఏదో వీడియో తీసుకుని ఇష్టారాజ్యంగా పోస్టు చేస్తున్నారని, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన మహిళా మంత్రిపై ఇలాంటి పోస్టులా అంటూ మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ. పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు తీయడం నేరమని. దీనిపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. సీతక్క మీద తప్పుడు ట్రోలింగ్ చేస్తే చర్యలు తీసుకోవద్దా. ప్రతిపక్ష సభ్యులు చర్యలు తీసుకోవద్దు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు. చివరగా దీనిపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. ఫోటో మార్ఫింగ్‌పై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## చంద్రబాబు మహిళలకు భరోసా

ప్రభుత్వమే మహిళా వసతి గృహాలను అద్దెకు తీసుకుని నిర్వహిస్తుంది. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కానీ.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కానీ వీటిని నిర్వహించనున్నారు. ఈ హాస్టల్స్‌పై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సీఎం అధికారులకు నిర్దేశించారు.రాష్ట్రంలో అంగన్వాడీల అభివృద్ధి పైనా సీఎం అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాల్లో ఎన్నింటిని అదే స్థాయిలో ఉంచాలి.?. ఎన్నింటిని ఉన్నతీకరించాలనే దానిపై సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న చోట అంగన్వాడీ కేంద్రాల ఆధునీకరణకు ఏమాత్రం అవకాశం ఉన్నా చేపట్టాలని అన్నారు. అలాగే, దాతల అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసే 'మేము సైతం' కార్యక్రమాన్ని కూడా తిరిగి అమలు చేయాలని నిర్దేశించారు.రాష్ట్రంలో 14,597 అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్, 8,455 కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా.. రానున్న 3 నెలల అన్నీ అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల పనుల్ని పూర్తి చేయాలని నిర్దేశించారు. దీని కోసం కేంద్ర పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునరుద్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో పని చేస్తే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, కందిపప్పు సహా మరిన్ని సరుకులు తక్కువ ధరకు అమ్మాలని సూచించారు. రానున్న రోజుల్లో రైతులకు ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అలాగే, రేషన్ డీలర్లను ఎలా ఉపయోగించుకోవాలి అనే అంశాలపై తగిన ప్రతిపాదనలతో రావాలని నిర్దేశించారు.రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల ఆర్థిక భద్రత తన బాధ్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లు తొలి రోజే 64 లక్షల మందికి ఇళ్ల వద్దే పంపిణీ చేయడం పూర్తి సంతృప్తి ఇచ్చిందని తెలిపారు. రికార్డు స్థాయిలో ఒక్కరోజులోనే 97.54 శాతం మందికి పింఛన్లు అందించినట్లు ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు ఒకటో తేదీనే అందించినట్లు వివరించారు

# ఇప్పుడు కాకపోతే.. మరెప్పుడు...

# పదవులపై రాని క్లారిటీ



✍ **జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 3:**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు కావస్తోంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో పదవుల కోసం చాలా మంది నాయకులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. అందుకే నామినేటెడ్ పోస్టులను కూడా ఎన్నడూ లేనట్లు వేగంగా భర్తీ చేసింది సీఎం రేవంత్ రెడ్డి సర్కార్. ఐతే... కొన్ని విషయాల్లో స్పీడుగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం... ముఖ్యమైన అంశాలపై ఎడతెగని జాప్యం చేస్తోందని కాంగ్రెస్ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రమంత్రి మండలిలో 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం సీఎంతోసహా 12 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరుగురికి చాన్స్ ఉన్నా... మంత్రివర్గాన్ని విస్తరించకుండా పెండింగ్‌లో పెట్టారు. ఇక మంత్రి మండలి విస్తరణనే కారణంగా చూపి పీసీసీ చీఫ్‌ను నియమించలేదు. మరోవైపు అసెంబ్లీలో కీలకమైన డిప్యూటీ స్పీకర్, చీఫ్ పదవులను కూడా భర్తీ చేయకపోవడంతో విలువైన సమయం కోల్పోతున్నామని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పదేళ్ల తర్వాత ఎంతో కష్టపడి అధికారం సాధిస్తే... అధిష్టానం జాప్యం చేయడం వల్ల ఆ అధికారాన్ని అనుభవించలేకపోతున్నామని ఎక్కువ మంది నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ లేకుండానే రెండు అసెంబ్లీ సెషన్లు ముగియడం కూడా వారి అసంతృప్తికి కారణమవుతోంది. ఈ రెండు పదవులపై చాలా మంది ఎమ్మెల్యేలు ఆశలు పెట్టుకున్నారు.

ఐతే సీఎం రేవంత్‌రెడ్డి కానీ, పార్టీ హైకమాండ్ కానీ ఈ విషయంపై దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదని వాపోతున్నారు ఆశావహులు. ఈ రెండు పోస్టులను మంత్రి మండలి విస్తరణకు లింకు చేసి పెండింగ్‌లో పెట్టడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు సీనియర్ నేతలు.ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో ఆరుగురికి అవకాశం ఉంది. కానీ ఆశావహులు మాత్రం డజను మంది ఉన్నారు. మంత్రివర్గ విస్తరణకు ప్రధానంగా సామాజిక సమీకరణాలు అడ్డొస్తున్నాయని సమాచారం. ప్రస్తుతం క్యాబినెట్‌లో లంబాడ సామాజికవర్గానికి అవకాశం దక్కలేదు. లంబాడ సామాజిక వర్గం నుంచి దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పోటీ పడుతున్నారు. అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి ఒకరికి అవకాశం ఇస్తామని గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఆదిలాబాద్, నిజామాబాద్, రంగా రెడ్డి జిల్లాలకు కూడా అవకాశం దక్కలేదు. రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి వంటి సీనియర్‌లు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావు, ఆదిలాబాద్ నుంచి ప్రేమ్ సాగర్ రావు, ఉమ్మడి నల్లగొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రేసులో ఉన్నారు.మంత్రివర్గంలో అవకాశం దక్కని నేతలకు రాజ్యాంగ బద్ధమైన డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌గా అవకాశం ఇవ్వాలని చూస్తోంది కాంగ్రెస్. కొందరు సీనియర్లకు, ముఖ్యంగా అవగాహన ఉన్న నేతలకు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పోస్టులను ఇవ్వాలని చూస్తుందట. రంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిల్లో ఒకరికి మంత్రి పదవి, ఇంకొకరికి డిప్యూటీ స్పీకర్ లేదా చీఫ్ విప్ ఇవ్వాలనే ప్రతిపాదన ఉందంటున్నారు. అదేవిధంగా లంబాడ సామజికవర్గం నుంచి మంత్రి వర్గంలో స్థానం ఆశిస్తున్న బాలూ నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ చేస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన పరిశీలిస్తోందంటున్నారు. మరోవైపు సామాజిక సమీకరణలు కుదరకపోతే సీనియర్ నేతలు ప్రేమ్‌సాగర్ రావు, సుదర్శన్ రెడ్డిలలో ఒకరికి ఈ రెండు పోస్టుల్లో ఏదో ఒకటి కట్టబెట్టాలని చూస్తోందంటున్నారు.మొత్తానికి పదవుల భర్తీకి పేర్ల పరిశీలనతోనే పార్టీ కాలక్షేపం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఇప్పటికే 8 నెలల సమయం ముగిసిందని.. ఇంకా ఆలస్యం చేయడం వల్ల పార్టీకి నష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కొత్త రేషన్ కార్డులు




✍ **జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 3:**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని నాటి పీసీసీ చీఫ్.. నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేర్చారు. పదేళ్లలో రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఈ విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆరు గ్యారంటీలతోపాటు అనేక హామీలు ఇవ్వడం, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో ప్రజలు ప్రభుత్వాన్ని మార్చాలని డిసైడ్ అయ్యారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్‌న గద్దె దించి.. కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడునెలలైనా కొత్త రేషన్‌కార్డుల జారీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇదే సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసర ఇచేస్తోంది.

రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను రేషన్‌కార్డు ఉన్నవారికే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ విషయంలో కూడా మొదట రేషన్‌కార్డు నిబంధన తెచ్చారు. కానీ, తర్వాత ఉపసంహరించుకున్నారు. ఇలా ప్రతీ ప్రభుత్వ పథకానికి రేషన్‌కార్డు తప్పనిసరి అయిన నేపథ్యంలో రాష్ట్రంలోని పేదలు కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం ఎదుచు చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చింది.తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేస్తోంది. అభయహస్తం ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే మధ్యలో లోక్‌సభ ఎన్నికలు రావడం, తర్వాత రుణమాఫీ కసరత్తు నేపథ్యంలో రేషకార్డుల జారీ విషయంలో జాప్యం జరిగింది. అయితే ఈ విషయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో అర్హులందరికీ త్వరలోనే రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఈమేరకు ఆగస్టు 1వ తేదీన నిర్వహించే కేబినెట్ సమావేశంలో రేషన్ కార్డుల జారీకి సంబంధించి విధి విధానాలు ఖరారు చేస్తామని తెలిపారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేసిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్ల రేషన్‌కార్డు ఉన్న అందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వలన ఆ బియ్యం రీసైక్లింగ్ అవుతున్నాయని, పొరుగు రాష్ట్రాలకు, లిక్కర ఫ్యాక్టరీలకు తరలిపోతున్నాయని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ చేస్తే అందరూ తీసుకోవడంతోపాటు తింటారని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది.ఇక రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పేదలందరికీ ఆరోగ్యశ్రీకార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈమేరకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో నిర్వహించే కేబినెట్ భేటీలో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు వేర్వేరుగా జారీ చేస్తామని తెలిపారు. మార్గదర్శకాలు జారీ అయిన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరలోనే ఈ పంపిణీ ప్రక్రియను మొదలు పెట్టనున్నట్టు తెలిపారు,




# పీఆర్సీ ఎప్పుడు..?

✍ **జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 3:**

ప్రభుత్వం ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌కు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ మాజీ మంత్రి బీఆర్ ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖాస్త్రం సంధించారు. ఇప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులను సులభతరం చేసింది తమ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రమోషన్స్ పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగులతో సీఎం రేవంత్ సమావేశం అయ్యారు. అంతకంటే ముందే ఈ సమస్యలపై స్పందించాలని హరీష్ డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన పిఆర్సి కంటే గొప్పది ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కర్ణాటకలో కొత్త పిఆర్సీ ఇప్పటికే అమలులోకి వచ్చింది, తెలంగాణలో మెరుగైన పిఆర్సి ఎప్పటి నుంచి అమలుచేస్తారో చెప్పాలని హరీష్ ప్రశ్నించారు. "మీరు మీ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కనీసం పెండింగ్‌లో ఉన్న 4 డిఎలు ఎప్పుడు ఇస్తారో చెబితే అందరూ సంతోషిస్తారు. న్యూ పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం తీసుకు వస్తామన్నారు. ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందో సభలో ప్రకటించాలి" అని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని మాట ఇచ్చారు. 8 నెలలు అయినా ఆ ఊసేలేదు. వారి సమస్యను ఎప్పుడు తీరుస్తారో సభాముఖంగా ప్రకటించండి. పాఠశాలలకు స్కావెంజర్స్‌ను అనుమతిస్తామన్న మీ హామీని ఎప్పుడు కార్యరూపంలోకి వస్తుందో చెప్పండి. పాఠశాలలకు ఉచిత విద్యుత్‌తోపాటు మరికొన్ని సమస్యలు ఉన్నాయి వాటినీ పరిష్కరించాల్సి." అని తన లేఖలో పేర్కొన్నారు హరీష్‌రావు. బదిలీ అయ్యి ఇప్పటివరకూ ఆ బడిలో చేరని ఎస్.జి.టి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు హరీష్. బదిలీలతో ఖాళీ అయిన పాఠశాలలో అవసరమైన మేరకు విద్యావాలంటీర్లను నియమించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని లేఖలో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల వేతనాలు కూడా పెంచుతామి చెప్పారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాల విద్యార్థులకు ఉదయం పూట ఇచ్చే టిఫిన్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ప్రమోషన్ వచ్చిన ఉద్యోగ ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడబోతున్న సీఎం పై సమస్యలకు పరిష్కారాన్ని చూపించాలి అన్నారు హరీష్. అదే టైంలో ఇప్పుడు తమవిగా చెప్పుకుంటున్న కొన్ని అంశాలు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలని గుర్తు చేశారు. 10,468 పండిత, పి.యిటీ పోస్టుల అప్ గ్రేడేషన్‌కు గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు ఇచ్చిందన్నారు. సర్వీసురూల్స్ 11, 12 మార్చామని కొత్తగా 2,3, 9,10 జి.ఓలు తీసుకొచ్చామన్నారు. 2023 సెప్టెంబర్ 18 నాడు కాళేశ్వరం జోన్ 1లో 1050 గజిటెడ్ ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లు ఇచ్చామన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 10,000 ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేశామన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయుల పదోన్నతులకు, బదిలీలకు కూడా గతప్రభుత్వమే లాంఛనాలు పూర్తిచేసిందన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం మొదటి దఫా 43 శాతం, రెండోసారి 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామన్నారు. కరోనాతో కష్టాల్లో ఉన్నప్పటికీ 30 శాతం పి.ఆర్.సి ప్రకటించామని తెలియజేశారు.

# పచ్చదనంతో అందమైన గార్డెనింగ్




✍ జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎలిఫెంట్ సర్కిల్ కూడలి వద్ద మహనీయుల విగ్రహాల ముందు కూడలిని అత్యాధునిక హంగులతో అభివృద్ధి కోసం కోటి పదమూడు లక్షల రూపాయలు, రామానుజ సర్కిల్ కొరకు అరవై అయిదు లక్షల రూపాయల నిధులు మంజూరైన నేపథ్యంలో శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నానక్ రాంగుడా, కొండాపూర్ లోని పలు కూడలిలను పరిశీలించడం జరిగింది. ఎలిఫెంట్ సర్కిల్ వద్ద కూడలిని కూడా పచ్చదనంతో అందమైన గార్డెనింగ్, స్కల్ప్చర్స్, ఫూట్ పాత్ తదితర అంశాలలో అధికారులకు సూచించిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిలాల్ DE రూపా, AE శ్రవంతి మరియు స్థానిక నాయకులు తాండవాసు గౌడ్, ఫైళ్ల ప్రవీణ్ కుమార్, దూల్మిట్ట దయాకర్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.







# ఇందిరా హై స్కూల్ లో విద్యార్థుల పట్టాభిషేక మహోత్సవం

- విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

✍ జయభేరి, ఉప్పల్ :

ఇందిరా హై స్కూల్ లో ఇన్వెస్టిట్యూర్ సరమనీ శనివారం ఘనంగా జరిగింది. ముందుగా నృత్య ప్రదర్శన తో కార్యక్రమం ప్రారంభించారు. ఈ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయజెన్ శేఖర్, నాచారం si మెహబూబ్ అలీ హాజరై విద్యార్థులకు బ్యాడ్జెస్, స్లాసెస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చిన్న తనంలో నాయకత్వం లక్షణాలు ఎంతో అవసరం అని ఇందిరా హై స్కూల్ విద్యార్థుల కు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ అన్వర్ మోహిను ద్దీన్, ఆఫ్సర్ మోహినుద్దీన్, ప్రిన్సిపాల్ షేహనాజ్ బేగం వైస్ ప్రిన్సిపాల్ అయేషా, P E T శేఖర్, టీచర్స్, పేరెంట్స్, విద్యార్థులు పాల్గున్నారు.




నాచారం వెస్లీ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకము ఆకస్మిక తనిఖీ చేసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శనివారం వెస్లీ స్కూల్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

✍ జయభేరి, ఉప్పల్

# మర్రి చెట్టుతండా గ్రామపంచాయతీలో గ్రామసభ

- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న స్వచ్ఛతనం- పచ్చదనం
- గ్రామ సభలో పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చిన మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు నేనావత్ శ్రీను నాయక్

✍ జయభేరి, దేవరకొండ :




గ్రామీణ ప్రాంతాలలో పరిశుభ్రత పచ్చదనాన్ని నిర్ధారిస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుచుటకు గాను గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన కార్యక్రమాలను గ్రామ సభ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అట్టి పనులను గుర్తించడం జరిగింది. మాజీ సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్వచ్ఛతనంపచ్చదనం గ్రామాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించడం వల్ల గ్రామాల్లో వీధులన్నీ పరిశుభ్రంగా మారి సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటుంది వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కాలి ప్రదేశాల్లో చెట్లు కూడా పెద్ద ఎత్తున నాటాలని, ప్రభుత్వ పాఠశాలలు,అంగన్వాడీలు గ్రామపంచాయతీ తదితర ప్రదేశంలో శానిటేషన్ నిర్వహించాలని గ్రామంలో ఉన్న అన్ని వార్డులలో పిచ్చి మొక్కలు తొలగించి దోమలు నివారించుటకు దోమల మందు స్ప్రే చేయించాలని వారు సూచించారు, గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి బ్లీచింగ్ చేయాలని వారు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టి ఏ పద్మ, ఏఎన్ఎం విజయ, అంగన్వాడీ కమల, పశు వైద్యాధికారి జితేందర్, మాజీ వార్డు సభ్యులు బాలు, గ్రామస్థులు, సక్రియా, లొకిరామ్ పాక, బిక్కు, బాలు తదితరులు పాల్గొన్నారు.



# కేబినెట్లో ముస్లిం మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వాలి

✍ జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ కేబినెట్లో ముస్లిం మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వాలని.. బి ఆర్ ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా నాయకులు మహ్మద్ ఇలియాస్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా విడుదల చేసిన ఓ ప్రకటన లో వారు మాట్లాడుతూ.. తెలంగాణలో ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని.. బ్యాంకు ల ద్వారా ఋణ సదుపాయం కల్పించి యువతను ఆదుకోవాలని.. కోరారు. ముఖ్యంగా పెండింగ్ లో ఉన్న షాది ముబారక్ నిధులు, మస్జిద్ లలో పనిచేసే ఇమామ్ మౌజన్ ల వేతనాలు విడుదల చేయాలని కోరారు, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న తదితర సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మహిళలకు 12 వేల కుట్టు మిషన్లు కేటాయించిందని అవి ఇప్పటివరకు పంపిణీ జరగట్లేదని తక్షణమే అవి లబ్దిదారులకు అందజేయాలని కోరారు.. అదేవిధంగా గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంత మైనార్టీ యువత కోసం లక్ష రూపాయలు పట్టణ ప్రాంత యువతకు రెండు లక్షల రూపాయల సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అవి లబ్ధిదారులకు చేకూరలేదని.. ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు, ఎస్సీ, ఎస్టీ వర్గాల మాదిరిగానే మైనారిటీల్లో కూడా పేదరికం ఉందని, ముస్లింలు, ఇతర మైనార్టీల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఆచరణాత్మక విధానం అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే విషయంలో ఎస్సీ, ఎస్టీల పట్ల ఎంత ఉదారంగా ఉంటుందో, ముస్లిం, మైనారిటీల విషయంలో కూడా అలాగే ఉండాలని కోరారు.. రాష్ట్రంలో ముస్లింల సమస్యలు తెలుపుకుందుకు.. రాష్ట్ర కేబినెట్లో ముస్లిం మైనారిటీకి మంత్రి పదవి కేటాయించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# స్టేషన్ ఘన్పూర్ రైల్వే స్టేషన్ లో గంజాయి పట్టుకున్న పోలీసులు

✍ జయభేరి, జనగామ:

స్టేషన్ ఘన్పూర్ రైల్వే స్టేషన్ లో పోలీసులు గంజాయి పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన మనోహర్ బాగ్వా పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. 7 కిలోల 100 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సుమారు 1,లక్ష 71 విలువ గల గంజాయి. జనగామ వెస్ట్ జోన్ డిసిపి రాజామహేంద్ర నాయక్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

# మొక్కలు నాటిన లైన్స్ క్లబ్ బృందం

- దేవరకొండ ప్రభుత్వ పాఠశాలలో క్రీడా సామాగ్రి అందజేత

✍ జయభేరి, దేవరకొండ :



క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం తో పాటు మానసిక ఒత్తిడిని జయించవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ అన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ ఇమ్మడి భద్రయ్య చంద్రకళల ఏకైక కుమార్తె పాపిశెట్టి సుధా సునీల్ కుమార్ (యూఎస్ఏ) జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో పాఠశాలకు క్రీడా సామాగ్రిని అందించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకునే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల లక్ష్యాలను నెరవేర్చుకోవడం కోసం చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. క్రీడల కోసం ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రభుత్వం నియమించిందని క్రీడా రంగానికి మంచి భవిష్యత్తు ఉందని ఆయన పేర్కొన్నారు.స్పోర్ట్స్ కోటా లో ఉన్నత విద్యా సీట్లతో పాటు ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతుందని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ కిట్టును అందించి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని చదువుతోపాటు క్రీడార రంగంలో రాణించాలని నేడు ప్రభుత్వ పాఠశాలలు అత్యద్భుతంగా కొనసాగుతున్నాయని నిష్టాతులైన ఉపాధ్యాయుల బోధన రుచిత పుస్తకాలు దుస్తువులతో పాటు భోజనాన్ని అందించి విద్యను అందిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలని తెలిపారు. వెనుకపడ్డ గిరిజన ప్రాంతమైన దేవరకొండ నుండి క్రీడారంగంలో జాతీయస్థాయి లో గుర్తింపు తీసుకురావాలని తాను చదువుకునే రోజుల్లో ఇలాంటి సౌకర్యాలు లేవని ఉన్నప్పటికీ సౌకర్యాలు లేవని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులే రాష్ట్ర స్థాయిలో ఇంజనీరింగ్ డాక్టర్స్ ఐఐటి ఎన్ఐటిలలో రాణిస్తున్నారని ఆయన తెలిపారు. పాఠశాలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సముద్రాల ప్రభాకర్, కోశాధికారి చిలుకూరు నిరంజన్, జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, ఇమ్మడి భద్రయ్య చంద్రకళ, గాజుల రాజేష్, చీదెళ్ళ వెంకటేశ్వర్లు, కుంచకూరి లక్ష్మణ్ ,నీల బుచ్చయ్య కర్నాటి గోవర్ధన్, లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర అధ్యక్షులు కూరెళ్ళ కృష్ణమాచారి, పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ టీ మంజుల, ఇన్చార్జి హెడ్మాస్టర్ పీ. నరసింహారెడ్డి, సయ్యద్, వెంకట్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పెర్సీన్, మద్దిమడుగు క్రాంతి దారం దామోదర్, నిర్మల, నారాయణ సింగ్, ఉపాధ్యాయులు లయన్ సభ్యులు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి




✍ జయభేరి, మేడ్చల్ :

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం గో గ్రీన్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గౌడవెల్లి గ్రామాల్లో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత మాట్లాడుతూ విద్యార్థులు. యువత పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. గో గ్రీన్ ప్లాంటేషన్ పేరుతో మొక్కలు నాటడమే కాకుండా పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు కళాశాలలో ఆవరణలో ప్రిన్సిపాల్,అధ్యాపకులు,విద్యార్థులు మొక్కలు నాటారు.

# ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం కోసం రోడ్లపై ప్రధాన సమస్యగా మారుతున్న తోపుడుబండ్లుతో ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా ఉండేవిధంగా ట్రాఫిక్ ఆపరేషన్ను ప్రారంభించినట్లు దేవరకొండ సీఐ నరసింహులు తెలిపారు. ఇందులో భాగంగా తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తోపుడుబండ్లను నిర్ణయించిన స్థలంలోణే తమ తోపుడు బండ్లు ఉంచుకోవాలని అన్నారు. వారు రోడ్డుపై యథేచ్చగా తిరగటానికి వీలు లేదని,దీనిని కట్టడి చేయడం కోసం దేవరకొండ పోలీసుల ఆధ్వర్యంలో హైదరాబాద్ తరహాలో ఆపరేషన్ నిర్వహణకు ప్రణాళికను రూపొందించారు.దీని వల్ల దేవరకొండ ట్రాఫిక్ సమస్యకు కొంతమేరకు చెక్ పడుతుందని పోలీసులు భావిస్తున్నారు అన్నారు ఈ కార్యక్రమంలో సీఐ ఎస్సై కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.



# పదవి కాపాడుకునేందుకు కుటిల రాజకీయాలా..?

## నూతనంగా ఏర్పడ్డ మేడ్చల్ జిల్లా ట్రస్మా కార్యవర్గం చెల్లదు

- రాష్ట్ర అధ్యక్ష పదవిని అడ్డుపెట్టుకొని నీచమైన చర్యలకు పాల్పడ్డ ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్.
- నీచానికి దిగజారి సంఘం ఐక్యతను దిగజార్చిన కరస్పాండెంట్లను ట్రస్మా జిల్లా, మండల అసోసియేషన్ల నుండి బహిష్కరిస్తున్నాం.
- బోడుప్పల్ లో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ట్రస్మా మేడ్చల్ జిల్లా కమిటీ, ఉప్పల్, మేడిపల్లి, ఘట్కేసర్ ట్రస్మా కమిటీలు.



**జయభేరి, మేడిపల్లి :**

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి భావితరాల భవిష్యత్తుకు బాటలు వేసే పాఠశాల యాజమాన్యాలే పదవి కాపాడుకునేందుకు కుయుక్తులు పన్నుతూ నిబంధనలను తుంగలో తొక్కుతూ వ్యవహరించడం ముమ్మాటికీ తప్పేనని మేడ్చల్ జిల్లా, ఉప్పల్, మేడిపల్లి, ఘట్కేసర్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ట్రస్మా ఖండించింది. ఈ మేరకు శనివారం బోడుప్పల్ నగరంలో మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం సమావేశమై నూతన అసోసియేషన్ ఏర్పడడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శుక్రవారం మేడిపల్లి లోని ఎస్ వి ఎం హోటల్లో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్ ఎన్నిక చేసిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నూతన కార్యవర్గం చెల్లదని, మల్కాజ్గిరి జిల్లా మొత్తంలో పట్టుమని పదిమంది కూడా పాఠశాల యజమాన్యాలు పాల్గొనలేదని దీనిని పూర్తిగా తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆ సంఘంలో పాల్గొన్న యాజమాన్యాల సభ్యత్వాన్ని జిల్లా నుండి, మండలం నుండి రద్దు చేస్తున్నామని వారిని అసోసియేషన్ నుండి బహిష్కరిస్తున్నామని ఖరాఖండిగా తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

రాష్ట్ర అధ్యక్షులు అయిన సాదుల మధుసూదన్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని 15 మండలాలకు సంబంధించిన ట్రస్మా సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా, ఎలక్షన్ నోటిఫికేషన్ ఇవ్వకుండా వాస్తవాలు దాచిపెట్టి తప్పుదోవ పట్టించారా లేదా ఉద్దేశపూర్వకంగానే మీటింగ్ జరిగిందా అనే సందేహం నెలకొంది. రాష్ట్రానికి అధ్యక్షుడైన సాదుల మధుసూదన్ పదవిపై కాంక్షతో మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని ఇది ముమ్మాటికి తప్పేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని చిన్న పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై యాజమాన్యాలు కలిసి ఒక సంఘముగా ఏర్పడి తెలంగాణ గుర్తింపు పొందిన యాజమాన్యాల సంఘముగా (ట్రస్మా) రిజిస్టర్ అయి మనుగడ సాధిస్తుంది. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై పోరాడుతుంది. గత సంవత్సరం కింద ట్రస్మా ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల అధ్యక్ష పదవికి హోరాహోరిగా పోటీపడ్డారు. అయితే ప్రైవేట్ పాఠశాలలను కాపాడాలన్న దృఢ నిశ్చయంతో శివరాత్రి యాదగిరి ప్రస్తుత రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు ఒక అడుగు వెనుకకు వేసి సంఘం ఐక్యతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర సీనియర్ ట్రస్మా నాయకుల సలహా మేరకు ఒక సంవత్సరం పాటు సాదుల మధుసూదన్, మరొక సంవత్సరం శివరాత్రి యాదగిరి అధ్యక్షులుగా వ్యవహరించేటట్టు సర్దుబాటు కుదిరింది. అయితే సాదుల మధుసూదన్ పదవి కాలం కేవలం నాలుగు నెలల్లో ముగిసిపోతుండగా పదవి పై కాంక్షతో ట్రస్మాను విడదీయాలన్న దుర్బుద్ధితో కొంతమంది యాజమాన్యాలను కూడగట్టుకొని నూతనంగా మేడ్చల్ జిల్లా యాజమాన్యాల సంఘంను ఏర్పడినట్లుగా మేడ్చల్ జిల్లా ట్రస్మా సభ్యులు భావిస్తున్నారు . మేడ్చల్ జిల్లా పరిధిలో సుమారు 550 పైచిలుకు ప్రైవేట్ పాఠశాలలు ట్రస్మా సభ్యత్వం పొంది ఉండగా కొంతమంది అసోసియేషన్ లో పదవి లేదన్న అక్కసుతో శుక్రవారం పదిమంది కరస్పాండెంట్లతో నూతనంగా మేడ్చల్ జిల్లా యాజమాన్యాల సంఘం ఏర్పడిందని పత్రికా ప్రకటనలు కూడా చేశారు. శుక్రవారం జరిగిన అసోసియేషన్ ను పూర్తిగా రద్దు చేస్తున్నామని మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా నియమింపబడ్డ జీవి రమేష్ (ముద్ర హై స్కూల్ ఉప్పల్ డిపో), మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించబడ్డ సిహెచ్.నిర్మలా రెడ్డి (విజ్ఞాన్ హై స్కూల్ చిలుకానగర్), జిల్లా కోశాధికారిగా ఎన్నికైన ఎస్. రమేష్ బాబు (శ్రీ చైతన్య క్రియేటివ్ స్కూల్ పర్వతాపూర్) ల ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని ట్రస్మా ఉప్పల్, ట్రస్మా మేడిపల్లి సంఘాల నుండి బహిష్కరిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ట్రస్మా రాష్ట్ర కమిటీ మేడిపల్లి మండల సభ్యులకు తెలియకుండా మీటింగ్ ఏర్పాటు చేసి మండల సభ్యుల ఐక్యతను చెడగొట్టిన రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్ ను బహిష్కరిస్తున్నామని ముక్తకంఠంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నిర్వహణ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, ట్రస్మా రాష్ట్ర అడ్వైజర్ నల్ల భాస్కర్ రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పి ఎల్ ఎన్ రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ షేక్ మదార్, ట్రస్మా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు జే. నాగరాజు, జిల్లా కోశాధికారి పరుశురాం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సత్తయ్య, పి ఆర్ఎస్ సతీష్, దేవదానం, ట్రస్మా మేడిపల్లి అధ్యక్షులు పి రవీందర్ రావు, మేడిపల్లి ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాసులు, జైనుద్దీన్, అడ్వైజర్స్ లక్ష్మణరావు, ఇసాక్ రాజు, మండల సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, గంగరాజు, ఘట్కేసర్ మండలం అధ్యక్షులు అంజన్ రెడ్డి, కోశాధికారి రాజశేఖర్, ఉప్పల్ మండల కోశాధికారి జహంగీర్, అడ్వైజర్ నితిన్ మిశ్రా, జగదీష్ జోషి, అల్తాఫ్, సత్యనారాయణ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అధ్యక్షుడైన సాదుల మధుసూదన్ పదవిపై కాంక్షతో మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని ఇది ముమ్మాటికి తప్పేనని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని చిన్న పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై యాజమాన్యాలు కలిసి ఒక సంఘముగా ఏర్పడి తెలంగాణ గుర్తింపు పొందిన యాజమాన్యాల సంఘముగా (ట్రస్మా) రిజిస్టర్ అయి మనుగడ సాధిస్తుంది. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై పోరాడుతుంది. గత సంవత్సరం కింద ట్రస్మా ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల అధ్యక్ష పదవికి హోరాహోరిగా పోటీపడ్డారు.





# ఇండస్ట్రియల్ పార్క్ తో యువతకు ఉద్యోగ అవకాశాలు

**జయభేరి, భూపాలపల్లి:**

భూపాలపల్లి జిల్లాలో నిరుద్యోగులు ఉద్యోగాల వేటలో చాలా మంది ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు.శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లో పర్యటించిన మంత్రులు ముందుగా జయశంకర్ జిల్లా గణపురం మండలం గాంధీనగర్ మైలారం గుట్టపై 50 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూపాలపల్లి, వర్ధన్నపేట శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, కే ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి శంకుస్థాపన చేశారు.

అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో మంత్రులు మాట్లాడారు. భూపాలపల్లికి ఇండస్ట్రియల్ పార్క్ రావడంతో భూపాలపల్లి యువతకు ఉద్యోగావ కాశాలు లభిస్తాయని మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.ములుగులో కూడా ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఉద్యోగం కోసం తెలంగాణ ఉద్యమం అని చెప్పి గత బీఆర్ ఎస్ పది సంవత్స రాలుగా ఒక్క నోటిఫికేన్ ఇవ్వలేదన్నారు. ధరణి తెచ్చి ఎందరినో ఇబ్బందులు పెట్టారని, సీఎం రేవంత్ రెడ్డి భూమాతను భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్ తెచ్చామన్నారు.

స్కిల్ ఇండియా ద్వారా యువతకు ఉద్యోగావ కాశాలు లభిస్తాయని తెలిపారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రుణ మాఫీ జరిగిందన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒకే సారి రెండు లక్షల రుణ మాఫీ చేశామన్నారు. భూపాలపల్లి అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని, వెనుక బడ్డ ప్రాంతాల అభివృద్దే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి సీతక్క తెలిపారు.

# సెప్టెంబర్ చివరినాటికి సమస్యలన్నీ పరిష్కరిస్తాను

- సింగరేణి సీఎంఓఏ సుజాత
- ఏరియా పరిరక్షణ కమిటీతో సీఎంఓఏ పోయే చర్చలు
- ఎమ్మెల్యే సమక్షంలోనే పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్మిక నేతలు



**జయభేరి, బెల్లంపల్లి:**

సెప్టెంబర్ చివరి నాటికి బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి సమస్యలన్ని పరిష్కరిస్తానని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో స్థానిక శాసనసభ్యులు గడ్డం వినోద్ సమక్షంలో సీఎంఓఏ సుజాతతో బెల్లంపెల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నేతలు చర్చలు జరిపారు. గత రెండు రోజుల క్రితం స్థానిక శాసనసభ్యుడిని ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నేతలు కలిసి సమస్యను విన్నవించడంతో అనంతరం సింగరేణి చైర్మన్ తో మాట్లాడి సమస్యను వివరించడం జరిగింది. దీంతో సింగరేణి చైర్మన్ ఆదేశాలతో సింగరేణి ఏరియా ఆసుపత్రి సందర్శనకు కొత్తగూడెం నుండి సింగరేణి సిఎంఓఏ సుజాత వచ్చారు. ఆస్పత్రి సందర్శన విషయం ముందే తెలియడంతో పెద్ద ఎత్తున సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ ట్రేడ్ యూనియన్ నాయకులు తరలివచ్చారు.. అనంతరం సింగరేణి ఆసుపత్రి సూపర్డెంట్ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ప్రధానంగా ఆసుపత్రి ఓపిలు తక్కువ చూపిస్తూ ఆస్పత్రిని ఇక్కడ నుండి ఎత్తివేసే కుట్రలకు సింగరేణి యాజమాన్యం వ్యూహాత్మకంగా ముందుకెళ్తోందని పరిరక్షణ కమిటీ నేతలు సీఎంఓఏకు తెల్చిచెప్పారు. ముఖ్యంగా ఆసుపత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్లను, ఇతర సిబ్బందిని త్వరితగతిన నియమించాలని విన్నవించడంతో సాధ్యమైనంత త్వరలోనే నియమిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నేతలతో సి ఎం ఓ ఏ చర్చల సందర్భంగా ఇతర సింగరేణి అధికారులు కలుగజేసుకోవడంతో పరిరక్షణ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కలగజేసుకున్న సీఎంఓఏ అందరికీ సర్ది చెప్పారు. మొత్తం మీద చర్చలు ప్రశాంత వాతావరణంలో సక్సెస్ అయ్యాయని ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ నేతలు చెప్పారు. అనంతరం పరిరక్షణ కమిటీ నాయకులు సీఎంఓఏ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు ఏఐటీయూసీ నుండి చిప్ప నరసయ్య, దాగం మల్లేష్, రత్నం ఐలయ్య, ఐఎన్టీయూసీ నుండి సిద్ధంశెట్టి రాజమౌళి, గెల్లి జయరాం యాదవ్, కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, హెచ్ఎంఎస్ నుండి ఎండి ఓజియార్, టి ఎన్ టి యు సి నాయకులు, పరిరక్షణ కమిటీ కన్వీనర్ టీ మణి రామ్ సింగ్, ఇఫ్టు నుండి ఎండి చాంద్ పాషా, ఎస్ మల్లేష్, ఎస్ జి కె ఎస్ నుండి అంబాల మహేందర్, ఏన్నం శంకర్, ఏఐఎఫ్ టియు నుండి ఎం పోచమల్లు, టీయుసిఐ గోగర్ల శంకర్, సిఐటియు నుండి వెంకటస్వామి, రమణ, టి ఎస్ యు ఎస్ నుండి టీ జైపాల్ సింగ్ లు చర్చల్లో పాల్గొన్నారు.

# బ్యాంకు ముందు రైతుల అందోళన

**జయభేరి, నిజామాబాద్:**

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో కెనరా బ్యాంక్ ముందు రైతు ఆందోళన నిర్వహించారు. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రుణ మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేసిన రెంజల్ బ్యాంక్ అధికారులు మాత్రం దానిని పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు... బ్యాంక్ అధికారులకు ఎందుకు రాలేదని అడిగితే టోల్ ఫ్రీ నంబర్ కాల్ చేయాలని సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు.

# ప్రతిఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు

- కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి




పీర్జాదిగుడా మున్సిపల్ కార్పోరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చామకూర మల్లారెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకొని, 25వ డివిజన్ లోని విహరిక, క్రాంతి కాలనీ, సాయి నగర్, సాయి హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు, కాలనీల అధ్యక్ష కార్యదర్శులు, పెద్దలు, మహిళలు అందరితో కలిసి ప్రారంభించారు. సాయి హిల్స్ లోని కార్ల్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని, కాలనీ మహిళల తో కేక్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్లకు నెలవారీ వేతనం రూ. 20,000 లను అందించారు. విద్యార్థులకు కావాల్సిన గ్రీన్ మ్యాట్, అలాగే 200 మంది విద్యార్థిని విద్యార్థులకు డైలీ న్యూస్ పేపర్ ను సంవత్సర కాలం ఫ్రీగా అందించనున్నారు. పిల్లలందరికీ అల్పాహారం అందించారు. తదనంతరం కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తమ నివాసంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో 25వ డివిజన్ విహరిక, శ్రీ సాయి నగర్, సాయి హిల్స్, క్రాంతి కాలనీల వాసులు, పెద్దలు, మహిళ సోదరసోదరిమణులు, పీర్జాదిగుడా పెద్దలు నాయకులు పాల్గొని, భోజన తాంబూలం స్వీకరించి, శుభాకాంక్షలు తెలిపారు. విహరిక కాలనీ ఆధ్వర్యంలో అమ్మఒడి అనాధ ఆశ్రమంలో అల్పాహారం అందించారు.కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.








# రాజన్నసన్నిధిలో బ్రేక్ దర్శనం

**జయభేరి, రాజన్న సిరిసిల్ల:**

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం నుండి బ్రేక్ దర్శనం అందుబాటులోకి రానుంది. శ్రావణ మాసం మొదటి వారంలోనే బ్రేక్ దర్శనాలను ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే యాదాద్రి ఆలయంలో బ్రేక్ దర్శనాలను పరిశీలించారు. బ్రేక్ దర్శనం టికెట్ ధరను రూ.300గా నిర్ణయించగా, పదేళ్ల లోపు చిన్నారులను ఉచితంగా అనుమతిస్తామని, ప్రతీ రోజూ ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు ఒకసారి, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మరోసారి బ్రేక్ దర్శనం కల్పించనున్నారు. ఈ టికెట్ తీసుకున్న భక్తులకు వంద గ్రాముల లడ్డూను ఉచితంగా అందించనున్నట్లు, బ్రేక్ దర్శనం టికెట్లను ఆఫ్లైన్ తోపాటు ఆన్లైన్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. బ్రేక్ దర్శనం సమయంలో, సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.




# ఆ నాజూకు నడకే క్యాట్‌వాక్కా..

తమిళ అగ్రహీరో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్). మీనాక్షి చౌదరి కథానాయిక. కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేశ్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మాతలు. తెలుగులో మైత్రీమూవీ మేకర్స్ విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్ 5న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'జిగి జింతాకు చూపే ఒక స్పార్కు.. ఆ నాజూకు నడకే క్యాట్ వాక్కా..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, యువన్‌శంకర్‌రాజా స్వరపరిచి, వృష బాలుతో కలిసి ఆలపించారు. ఈ పాటలో విజయ్ డాన్స్ మూమెంట్స్ మెస్మరైజ్ చేస్తాయని, విజయ్, మీనాక్షి చౌదరి కెమిస్ట్రీ ఈ పాటలో ఓ రేంజ్‌లో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ నుని.





# ఈ ప్రశ్న హీరోలను ఎందుకు అడగరు..?

బాలీవుడ్ అగ్ర నటులు అజయ్ దేవగణ్, టబు ప్రధాన పాత్రల్లో నటించిన ప్రేమకథా చిత్రం 'ఔర్ మే కహా దమ్ థా'. ఈ సినిమాకు నీరజ్ పాండే దర్శకత్వం వహించగా.. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్‌లో పాల్గోన్న టబు పారితోషికం వ్యత్యాసాలపై గట్టిగా స్పందించింది. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక రిపోర్టర్ ఈ సినిమాకు మీ రెమ్యూనరేషన్ ఎంత అని అడుగుతాడు. దీనిపై స్పందించిన టబు ప్రతిసారి ఈ ప్రశ్నను హీరోయినులను మాత్రామే ఎందుకు అడుగుతారు. నిర్మాతలను అడగవచ్చు కదా! అలాగే మీకు మాత్రమే ఎందుకు ఎక్కువ రెమ్యూనరేషన్ ఇస్తున్నారు అంటూ హీరోలను కూడా అడగవచ్చు కదా? ఇలా మీరు అడిగితే ఇలాంటి విషయంలో ఎన్నో మార్పులు వస్తాయి అని టబు తెలిపారు. రీసెంట్‌గా బాలీవుడ్‌లో క్రూ అనే సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది ఈ భామ. కరీనా కపూర్, టబు, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం రూ. 100 కోట్ల వసుళ్లను రాబట్టింది. మరోవైపు ఇప్పటికే అజయ్‌తో కలిసి టబు హిందీ 'దృశ్యం'తో పాటు దే దే ప్యార్ దే సినిమాలో నటించారు. ఇక 'ఔర్ మే కహా దమ్ థా' చిత్రంలో వీరి కాంబో రిపీట్ అవుతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చిన్న వయసు నుంచే ఇష్టాన్ని పెంచుకున్న కృష్ణ (అజయ్), వసుధ (టబు)లు ఒకరంటే ఒకరికి ప్రాణం ఉండి ఎందుకు విడిపోయారు? మళ్లీ తిరిగి కలిశారా? లేదా? విడిపోయిన తర్వాత వారి జీవితాల్లో వచ్చిన మార్పులు ఏమిటి? అనే ఆసక్తికర అంశాలతో ఈ చిత్రం తెరకెక్కింది.

## చైల్డ్ ఆర్టిస్ట్‌గా రాజమౌళి..
# ఏ సినిమానో తెలుసా..?

టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళిపై ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ తీసిన విషయం తెలిసిందే. మాడర్న్ మాస్టర్స్ ఎస్.ఎస్ రాజమౌళి పేరిటా ఈ డాక్యుమెంటరీ రాగా.. శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి తన గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. రాజమౌళి పర్సనల్ లైఫ్ గురించి ఇంటర్వ్యూ ఫార్మాట్‌లో ఈ డాక్యుమెంటరీ ప్రారంభంకాగా.. ఒకవైపు ఇంటర్వ్యూ జరుగుతునే మరోవైపు ఆయన మేకింగ్ స్టైల్‌తో పాటు.. రాజమౌళి ఫ్యామిలీ మెంబర్స్, ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్, రానా సహా తదితరులు జక్కన్నతో కలిసి పని చేసిన అనుభవాన్ని చెబుతున్న దృశ్యాలను చూపించారు. ఎన్టీఆర్ స్టూడెంట్ నెం. 1 గురించి తెలియని విషయాలు వెల్లడించగా.. రామ్ చరణ్ మగధీర సినిమా గురించి తెలియని విషయాలను వెల్లడించాడు. ఇక వీరితో పాటు ప్రభాస్ బాహుబలి గురించి చెబుతూ.. బాహుబలి ఫస్ట్ పార్ట్ తెలుగులో ఫ్లాప్ టాక్ రావడం, హిందీలో బ్లాక్ బస్టర్ రావడం వంటి విషయాలను వెల్లడించాడు. ఇక హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరున్ ఆర్ఆర్ఆర్ సినిమా చూసి షాక్ అవ్వడం, తన వర్క్ గురించి మెచ్చుకోవడం ఇందులో కనిపించాయి. ఈ డాక్యుమెంటరీలో తన ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్‌తో పాటు తన మూవీ ప్రయాణం ఎలా స్టార్ట్ అయ్యింది. తన మువీలకు చివరిలో ఏ ఫిల్మ్ బై ఎస్. ఎస్. రాజమౌళి అనే ట్యాగ్‌లైన్ ఎలా పుట్టుకు వచ్చింది లాంటివి రాజమౌళి వెల్లడించారు. బాహుబలి ఫ్లాప్ టాక్ వచ్చినప్పుడు షాక్ అయ్యానని.. అలాగే కట్టప్ప క్యారెక్టర్‌ను తక్కువ చేయడం అనేది ఎందుకు అనే విషయాలను వెల్లడించాడు. ఇదే కాకుండా తాను పిల్లన గ్రోవి అనే సినిమాలో కృష్ణుడి పాత్రలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించినట్లు చెప్పి అందరిని షాక్‌కి గురిచేశాడు. అలాగే అర్ధాంగి అనే సినిమాకు అసిస్టెంట్‌గా చేసినట్లు ఇందులో వెల్లడించారు. వీటితో పాటు రాజమౌళి గురించి తెలియని చాలా విషయాలను ఇందులో చెప్పినట్లు తెలుస్తుంది.





# మా నాన్నకు నేను దర్శకుడిని అవ్వడం ఇష్టం లేదు

మణిరత్నం చిత్ర పరిశ్రమలో ఇదొక సంచలనాత్మకమైన పేరు. దర్శకుడిగా ఎందరికో ఆయన ప్రేరణ. ఆయన దర్శకుడిగా కెరీర్ మొదలుపెట్టి దాదాపు 30 సంవత్సరాలు దాటినా.. ఆయన చేసిన సినిమాలు చాలా తక్కువే.. క్వాంటిటీ కన్నా క్వాలిటీ ముఖ్యం అని నమ్మే అతి కొద్ది దర్శకుల్లో ఆయన ఒకరు. భారతీయ సినీ పరిశ్రమలో ఎందరో దర్శకులకు ఆయన ఆదర్శ ప్రాయుడు. రోజా, దళపతి, బొంబాయి, గీతాంజలి ఇలా ఎన్నో మరపురాని చిత్రాలకు నిర్దేశకుడు. అయితే దర్శకుడిగా ఇంతటి సంచలన చిత్రాలకు కారణమైన మణిరత్నం అసలు దర్శకుడిగా మారటం, సినీ పరిశ్రమలోకి రావడం వాళ్ల నాన్నకు అస్సలు ఇష్టం లేదట. ఈ విషయం గురించి మణిరత్నం ఓ సందర్భంలో చెప్పారు. వీనస్ స్టూడియో రత్నం అయ్యర్ కొడుకుగా వారసత్వంగా మీరు సినీ పరిశ్రమలోకి వచ్చారని చాలా మంది అనుకుంటారు. నాతో అడిగారు కూడా. కానీ నేను దర్శకుడిగా మారింది అలా కాదు. అంతేకాదు మా నాన్న మొదటినుంచి మా కుటుంబాన్ని చిత్ర పరిశ్రమకు దూరంగా వుంచాలని ప్రయత్నించేవాడు. ఆయన ఇష్ట ప్రకారమే నేను ముంబయ్‌లో ఎంబీఏ పూర్తిచేశాను. అయితే ఆ సమయంలోనే ఓ కంపెనీకి డైరెక్టర్‌గా వుండి.. అంత మందితో పనిచేయిస్తూ.. ఆ ఒత్తిడిని తట్టుకోవటం కంటే. నాకు సృజనాత్మకమైన దర్శకుడిగా వుండటం బెటర్ అనిపించింది. అందుకే సినిమాల వైపు వచ్చేశాను. అయితే అందరూ నేనేదో విదేశాలకు వెళ్లి ఫిలిం కోర్సు చేశానని అనుకుంటారు. కానీ నేను ఎలాంటి కోర్సు పూర్తిచేయలేదు. నిజం చెప్పాలంటే సినీ పరిశ్రమకు వచ్చే నాటికి నాకు దర్శకత్వం అంటే ఏమో కూడా తెలియదు. పట్టుదలతో ఏదైనా నేర్చుకుంటే వస్తుందనే నమ్మకంతోనే ఒక సినిమాకు దర్శకత్వం వహించాను. అలా ఆ రోజు ధైర్యం చేశాను. కానీ ఆ రోజు నుంచి ఈ రోజు ప్రతి రోజు ఏదో ఒకటి నేర్చుకుంటూనే దర్శకత్వం చేస్తున్నా.. ప్రతి సినిమా మొదటి సినిమాలాగా కష్టపడాల్సిందే అని చెప్పుకొచ్చారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com